# మీసాల మీమాంస

## పోలాప్రగడ సత్యనారాయణమూర్తి

యోధులు మీసం పెంచుతారనీ, మేధావులకి తప్పకుండా పిల్లి గెడ్డమో వారు గెడ్డమో ఉండి తీరుతుందనీ, యోధులైన మేధావులకీ లేదా మేధావులైన యోధులకీ, తత్సంబంధితమైన ముఖ చిహ్నాలు రెండూ ఉంటాయనీ, నాకు ఎందుకో చిన్నప్పటి నుంచీ ఒక గట్టి నమ్మకం ఏర్పడిపోయింది. వయస్సుతో బాటు ఆ నమ్మకం కూడా ఎదుగుతూ వచ్చింది. టాగూర్, బెర్నార్డ్‌షా,మార్క్స్, ఛత్రపతి శివాజీ,అబ్రహాంలింకన్ వంటి మహామహుల ఫోటోలు చూడ్డంతోనూ, అప్పుడప్పుడు పేపర్లలోనూ టీ. వీ. లలోనూ..... ప్రత్యక్షమయ్యే అణు శాస్త్రజ్ఞుల బొమ్మలూ, నోబెల్ బహుమతి గ్రహీతలైన సైంటిస్టుల బొమ్మలూ పరిశీలించడంతోనూ, సదరు నమ్మకం, ఇనుమూ సిమెంటూ కలిసి పోసిన పునాదిలాగ, గట్టిగా అచంచలంగా పాతుకుపోయింది మనస్సులో-

మీసాలకీ గెడ్డాలకీ సంబంధించిన ఈ నమ్మకం స్థిరీకరం చెందడానికి మరో కారణం కూడా ఉంటే ఉండవచ్చు. అదేమిటంటే, నేను పిరికివాణ్ణనే సంగతి ఒకరు చెప్పక్కర్లేకుండానే నాకు తెలుసు. తెలివైనవాణ్ణి కాదన్న సంగతి పెళ్ళయిన తర్వాత తెలిసి వచ్చింది. ఇవాళ్టికి కూడా రోజుకొక్కసారైనా నా తెలివి తక్కువతనం ఎంతటిదో గుర్తుచేస్తూ ఉంటుంది మా ఆవిడ. అందువల్ల వెరసి, నేను యోధుణ్ణీ కాదు మేధావినీ కాదు అని, బట్టల సబ్బుతో ఉతికి ఎండేసిన జేబు రుమాలు లాగ, తెల్లగా తేలిపోయింది. ఈ ప్రముఖ సత్యానికి ప్రబల తార్కాణమేమో అన్నట్టు, నాకు మొదటి నుంచీ మీసాలూ గెడ్డాలూ లేవు. తర్వాత ఎన్ని ప్రయత్నాలు చేసినా రాలేదు. గీసి చూశాను. గియ్యకుండా కొన్ని నెలలు వదిలేశాను. కోశ సంవర్ధకాది ఎరువులెన్నో వాడాను. ఉహూ!.... ఏం చేసినా ఏం ఫలితం కనిపించక, కళాయి చేసిన అద్దంలా నున్నగా ఉండిపోయింది నా ముఖం. ఓహో! మనం యోధుడూ మేధావీ ఏమీ కాదు కదా. ఏ ఒక్క గుణం ఉన్నా, మనకి ఏ ఒక్కటో ప్రాప్తించి ఉండేది. అందువల్ల ధైర్యం తెలివీ ఉంటే, తప్పకుండా మీసం గెడ్డం ఉంటుంది. ఏవీ లేని వాళ్ళకి మనలాగే ఉంటుంది ముఖం. ఆడముఖంలాగ.

అవునా?- మా ఆవిడ నాకంటే ధైర్యం, తెలివీ ఎక్కువ ఉన్నదే కదా- అలాగే చాలామంది ఆడవాళ్ళలో ధైర్యస్థులూ ఉన్నారు కదా- మరి వాళ్ళకి....?

ఈ అనుమానమే ఒకసారి మా ఆవిడ దగ్గర వ్యక్తపరిస్తే, "చాల్లెండి. మీ తెలివి తెల్లవారినట్టే ఉంది. నా దగ్గర అంటే అన్నారు. ఎవరి దగ్గరా అనకండి. మీ అనుమానానికి సంబంధించిన ఈ వార్త ఆ నోటా ఆ నోటా ప్రాకి ఏ స్త్రీ విమోచన సంఘం వారికేనా తెలిస్తే కొంపలంటుకుంటాయి" అంటూ ఓ అరగంట తలంటేసింది.

దాంతో మీసాలూ- గెడ్డాలూ వీటికి సంబంధించిన అనుబంధపు ఆలోచనలకన్నింటికీ స్వస్తి చెప్పి, తల్లి వేరులాంటి ఆ ఒక్క ఆలోచననే పట్టుకుని కూర్చున్నాను; అదేవిటంటే-

"మీసాలూ, గెడ్డాలూ దిట్టంగా ఉన్నవాళ్ళంతా యోధులూ, మేధావులూ- అందుకు సందేహం లేదు".



ఇలా మర్రి ఊడలాంటి ఆలోచనని పట్టుకుని, నేను ఉయ్యాలలూగుతూ ఊరేగుతూండగా, మా ప్రక్కింట్లో ఓ వాటాలోకి, నలభైయేళ్ల నడి వయస్కుడొకాయన అద్దెకి వచ్చాడు. ఆయన కుటుంబ సభ్యులెవరో, వాళ్ళెంతమందో నేను గమనించలేదు కాని, ఈయన్ని మాత్రం ప్రత్యక్షంగా ఓ ఉదయం చూశాను.

ఓరి నాయనోయ్! అవేం గడ్డాలు! అవేం మీసాలు! ముక్కూ, కళ్ళూ, నుదురూ అనబడే ఆ మూడు సంరక్షిత ప్రదేశాలు తప్ప, తక్కిన ముఖాన్నంతా విదేశీ సైన్యంలా ఆక్రమించేశాయి గెడ్డాలూ మీసాలూ. ప్రొద్దుటి లేత ఎండ పడి మీసాలు రెండూ అటూ ఇటూ చురకత్తుల్లా మెరిసి పోతూంటే, గెడ్డం మాత్రం తళ తళలాడుతూ గుండెల దాకా ప్రవహిస్తూన్న సెలయేరులా ఉంది. ఆయన ముఖానికి అవి, పెట్టని ఆభరణాలులాగా, ప్రత్యేకం ఆయన కోసం అని దేవుడు అందించిన అలంకారాలు లాగా ఉన్నాయి.

నల్లగా అవి ఎంత అందంగా ఉన్నాయో, అంత భయంకరంగా కూడా ఉన్నాయి. గెడ్డాన్ని ఒక పెద్ద పుట్టగా మనం భావిస్తే, ఆ పుట్టలోంచి లేచిన రెండు నల్లత్రాచుల్లా ఉన్నాయి ఆ మీసాలు...

ఓయ్ బాబోయ్ అని మొదట భయపడ్డా. కాస్సేపయ్యాక ఆయన గెడ్డాల్నీ మీసాల్నీ మనస్సార అభినందించకుండా ఉండలేకపోయాను.

అసలు గెడ్డాలూ మీసాలూ అంటే అవీ-

అసలు సిసలయిన మేధావీ యోధుడూ అంటే ఈయన! వెంటనే ఆయన పట్ల పట్టలేనంత గౌరవప్రపత్తులు ఏర్పడిపోయాయి. ప్రొద్దుటే లేచి ఎవరి మొహం చూశానో కాని ఒక మహామహుణ్ణి దర్శించగలిగాను. నా ఆనందాన్ని పంచుకుంటుంది కదా అని మా ఆవిణ్ణి పిలిచి అవతలివారి పెరట్లోకి చూడమన్నాను. ఇల్లాలు కనుకా, పైగా భర్తనైన నేను సాక్షాత్తూ ప్రక్కనే ఉన్నాను కనుకా, మరీ అంత బాహాటంగా చూస్తే బాగుండదని, కిటికీ తలుపు సందుల్లోంచి, రహస్యంగా చూసింది- చూసి తల పంకించింది.

"ఫరవాలేదు- మీకూ కాస్త కరెక్టుగా ఆలోచించడం, ఎవరు ఎంతటి గొప్పవారో తెలుసుకోగలగడం వస్తున్నాయి" అంటూ జీవితంలో మొదటిసారిగా నన్ను అభినందించింది.



ఆ అభినందనతో కోటి ఏనుగుల బలం వచ్చి, ఇంక అక్కడి నుంచి తదుపరి కార్యక్రమం ప్రారంభించాను.

ముందా మీసాల వీరుణ్ని చిరునవ్వుతో పలకరించాను.... తర్వాత ఉత్తి పుణ్యాన ఓ గుడ్‌మార్నింగ్ కొట్టాను. రెండు రోజులు పోయాక "మీరు మా పక్క వాటాలోకి వచ్చారా?.... బాగుంది" అంటూ నా సంతోషాన్ని వ్యక్తపరిచాను... ఆయన కూరలకనో, పచారీ సామానుకనో బయలుదేరుతూంటే, పనిలేక పోయినా ఆయనతో బాటు ఆయా షాపులదాకానూ అంగళ్ళ దాకానూ వెళ్ళి తిరిగి రాసాగాను. ఒకటి రెండు మార్లు మా ఇంటికి కాఫీకి ఆహ్వానించాను. ఆయనతో పరిచయం బాగా పెంచుకొని తరచు ఆయన పక్క ఫక్కనే తిరుగుతూ, పదిమందికీ వీళ్ళిద్దరూ మంచి స్నేహితులు అనే అభిప్రాయాన్ని తీసుకు వచ్చాను.

అలా తీసుకు రావడంలో ఉద్దేశం ఒకటి ఉంది.

అలాంటి యోధుడు మన స్నేహితుడంటే మన జోలికి ఎవరూ రారు. మనం అంటే అందరికీ కొంచెం పక్క బెదురుంటుంది. అదో లాభం- రెండోది- అలాంటి మేధావి మిత్రుడు అనేసరికి సంఘంలో మన హోదా బాగా పెరుగుతుంది. మనకీ ఒక స్టేటస్ అంటూ వస్తుంది. పైగా, నాకు లేని మేధాసంపత్తీ, ధైర్యస్థైర్యాలూ ఆయనకి ఉన్నాయి. కలిసిమెలిసి తిరిగితే కాస్త మనకీ అవి వంటబట్టొచ్చు- ఇన్ని ఆలోచనలు పెట్టుకొని ఆయన్ని అభిమాన గౌరవాలతోటీ, ఆత్మీయతా మర్యాదలతోటీ చూడసాగాను.

ఓ రోజున మా యింట్లో టీ త్రాగి, కబుర్లు చెప్పుకుంటూన్న సమయంలో, "మీరెంతో నా పట్ల గౌరవంగానూ, ప్రేమగానూ ఉంటారు... మీలాంటి సజ్జనుల పరిచయం కలగడం నా అదృష్టం" అన్నారాయన.

"అదృష్టం మాది" అంది గడప అవతల నిలబడ్డ మా శ్రీమతి-

"నేనొక్కణ్ణే ఏవిటండీ! మీలాంటి యోధుల్నీ, మేధావుల్నీ ఎవరేనా గౌరవిస్తారు" అన్నాను.

అతను నవ్వుతూ "నేను ధైర్యస్థుణ్ణా? మేధావినా?, ఎవరన్నారు?" అన్నాడు.

"ఎవరా?... మీ మీసాలూ గెడ్డాలే!" అన్నాను నేను అంతకంటే నవ్వుతూ.

"ఇవా?.... వీటికి బోలెడు కథ వుంది. అసలు ఇలా వీటిని అరణ్యంలా పెంచడం నాకూ మా ఆవిడకీ ఇష్టంలేదు."

"వదినగారికి కూడా ఇష్టం లేదా?" మా ఆవిడ ఆశ్చర్యంగా చూసింది.

"అవునమ్మా- నాకు చదువూ లేదు, ఉద్యోగంలేదు. మా చెల్లెలే నన్నూ, మా ఆవిడనూ పోషిస్తోంది. దానికి బోలెడు ఆస్తి ఉంది. వాళ్ళ మావగారు రెండేళ్ళ క్రితం పోయారు. ఏడాది వెధవ, మా మేనల్లుడు ఆయన కోసం బెంగెట్టుకుంటే, మా చెల్లెలు అంది "అన్నయ్యా నువ్వు గెడ్డాలూ మీసాలూ పెంచాలి. నిన్ను చూసి వాడు వాళ్ళ తాతయ్య అనుకొని బెంగ మరిచిపోతాడు" అని. వాడి కోసం నేను గెడ్డం పెంచడం ఏమిటి అన్నాను- టాట్ వీల్లేదంది మా చెల్లి. మరి దాని రక్షణలో ఉన్నాం కదా. తప్పలేదు- ఇదమ్మా గెడ్డం మీసం కథ. వస్తాను. ఎక్కడికి వెళ్ళావని అరుస్తున్నారు అదిగో మా ఆవిడా చెల్లాయీ అంటూ భయం భయంగా "వస్తున్నా వస్తున్నా" అంటూపరిగెట్టాడు- ఊడిపోతూన్న పంచె, గోచీ సర్దుకుంటూ. పరిగెడుతూన్న ఆ యోధుణ్ణీ మేధావినీ చూస్తూ స్థాణువుల్లా నిలబడిపోయాం నేనూ, మా ఆవిడాను. ●